



బయ్యారం సుద్దరేవు బ్రిడ్జి వద్ద జేసీబీతో చెత్తాచెదారం తొలగిస్తున్న దృశ్యం



మత్తడి పోస్తున్న ఓటాయి పెద్దచెరువు

తగ్గిన వరద ఉధృతి

- గంగారం, బయ్యారంలో రాకపోకలు పునరుద్ధరణ
- గార్ల, గూడూరు మండలాల్లో గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- కొత్తగూడ, గూడూరులో భారీ వర్షం
- మత్తడి పోస్తున్న 144 చెరువులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు గురువారం రాత్రి తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం మధ్యాహ్నం కొత్తగూడ, గూడూరు మండలాల్లో భారీ వర్షం కురియగా, కేసముద్రంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. గంగారం, బయ్యారం గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు శుక్రవారం పునరుద్ధరించారు. గూడూరు మండలం దొరవారితిమ్మాపురంలో రెండువాగులు మధ్యాహ్నం నుంచి పొంగిపొర్లుతుండడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కురుస్తున్న వర్షాలకు పలు మండలాల్లో 144 చెరువులు మత్తడి పోస్తున్నాయి. మరోవైపు కొన్ని మండలాల్లో 55 శాతంలోపే చెరువుల్లో నీరు చేరింది. కొంతమంది రైతులు ఆనందంతో ఉండగా మరికొంతమంది చెరువుల్లోకి నీరు చేరలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

కొత్తగూడ మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. బూర్కపల్లి, కత్తెర్ల, ముస్మీవాగుల ప్రవాహం కొంత తగ్గింది గత బుధవారం చేపలవేటకు వెళ్లిన వ్యవసాయ కూలీ ఆగబోయిన నరేష్ మృతదేహం బూర్కపల్లి వాగుకు కిలోమీటర్ల దూరంలో ఉదయం 11 గంటల సమయంలో లభ్యమైంది. గంగారం మండలంలో ఉదయం నుంచి ముసురు కురుస్తోంది. కోమట్లగూడెం పెద్దచెరువు (మిగతా 8లో...)

జిల్లాలో సగటున 16.2 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ జిల్లాలో 259.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, నగటున 16.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 19.8, గంగారంలో 21.6, బయ్యారంలో 18.6, గార్లలో 18.6, డోర్నకల్, కురవి మండలాల్లో 15.2 చొప్పున, మహబూబాబాద్‌లో 13.8, గూడూరులో 17.0, కేసముద్రంలో 18.4, నెల్లికుదురులో 14.2, నర్సింహులపేటలో 10.0, చిన్నగూడూరులో 13.4, మరిపెడలో 16.8, దంతాలపల్లిలో 15.4, తొర్రూరులో 14.8, పెద్దవంగరలో 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



గార్ల పాకాలవాగు వద్ద గస్తీ నిర్వహిస్తున్న సీఐ రవికుమార్, ఎస్సై రియాజ్‌పాష

బిజినెస్ ధమాల్..

రేషన్ సన్న బియ్యంతో పడిపోయిన రైస్ అమ్మకాలు

- డిమాండ్ లేని ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ రకాలు
- అతిసన్న 'జైశ్రీరాం' రకాల ఎగుమతులతోనే వ్యాపారం
- జిల్లాలో మూడునెలలకు ఒకేసారి 1.44లక్షల క్వింటాళ్ల పంపిణీ



కేసముద్రంలో అమ్మకాలు లేక పేరుకుపోయిన సన్నబియ్యం నిల్వలు

కేసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం కేంద్రంగా కొనసాగుతున్న సన్న బియ్యం వ్యాపారం ఒక్కసారిగా పడిపోయింది. ఇక్కడి మిల్లుల్లో ఉత్పత్తి అయిన సన్నబియ్యం రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు ఎగుమతి అయ్యేది. సీజన్‌ల వారీగా ఏడాదికి సరిపోను బియ్యం ఇక్కడ కొనుగోలు చేసుకొని ఇళ్లలో నిల్వలు పెట్టుకునే వారు. దూర ప్రాంతాల్లోని వారు కేసముద్రంలోని మిల్లుల నుంచి బియ్యం కొనుగోలు చేసి తీసుకువెళతుంటారు. జోరుగా మూడుపువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్న బియ్యం వ్యాపారం ఒక్కసారిగా కుదేలైపోయింది. కాంగ్రెస్ సర్కారు చౌకధరల దుకాణాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఈ సన్నబియ్యం గతంలో రేషన్‌షాపుల్లో అడపాదడపా ఇచ్చిన మాదిరిగా కాకుండా బయట ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసినట్లుగా 'సూపర్‌ఫైన్'గా ఉండడంతో ప్రతీ ఒక్కరు ఇంట్లో వినియోగిస్తున్నారు. ఫలితంగా బయట ప్రైవేటు వ్యాపారుల బియ్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయి.

ఒకేసారి 1.44 లక్షల క్వింటాళ్ల బియ్యం పంపిణీ...

మహబూబాబాద్ జిల్లాలో 2.43 లక్షల రేషన్‌కార్డుదారులకు గతనెలలో మూడు నెలలకు సంబంధించిన 1.44లక్షల క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జిల్లాలో 2,40,543 రేషన్‌కార్డులుండగా ఇందులో అంత్యోదయ ఆహార భద్రత కార్డు (ఏఎఫ్ఎస్‌సీ)లు 16,792 ఉండగా ఇందులో 51,355మంది లబ్ధిదారులకు 5,877.2 క్వింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేశారు. అలాగే ఆహార భద్రత కార్డు (ఎఫ్ఎస్‌సీ)లు 2,23,749 ఉండగా ఇందులోని 6,69,067మందికి 40,144.02 క్వింటాళ్ల బియ్యం, (మిగతా 8లో...)

రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో ఒక్కసారిగా ప్రైవేటు మార్కెట్లో బియ్యానికి డిమాండ్ పడిపోయింది. ఒకేసారి మూడునెలల సన్నబియ్యం తీసుకున్న లబ్ధిదారులు అంతకు ముందు నెలలో తీసుకున్న సన్నబియ్యంతో కలిపి ఒక్కో ఇంట్లో నాలుగు నెలలకు సరిపోను నిల్వలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో అడపాదడపా రేషన్ షాపుల్లో ఇచ్చిన సన్నబియ్యం మాదిరిగానే ఉంటాయని పలువురు లబ్ధిదారులు భావించారు. ఇందుకు భిన్నంగా మార్కెట్లో లభించే బియ్యం మాదిరిగానే రేషన్ షాపుల్లోని సన్నబియ్యం ఉండడం, అందులో విటమిన్లు, సూక్ష్మపోషకాలు కలిపిన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కే) కలిసి ఉండడంతో అందరూ ఇళ్లలో వండుకొని తినడం ప్రారంభించారు. ఫలితంగా ప్రైవేటులో సన్న బియ్యం కొనుగోళ్లు 90శాతానికి పడిపోయాయి. కేసముద్రంలోని ఓ రైస్ మిల్లులో గతంలో సీజన్లో 500 నుంచి 600 క్వింటాళ్ల విక్రయించగా సన్నబియ్యం పంపిణీ పథకం తర్వాత 10 క్వింటాళ్లు కూడా విక్రయించలేదని చిరువ్యాపారులు చెబుతున్నారు. సన్నరకాలైన ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ రకాల అమ్మకాలు పడిపోగా ప్రస్తుతం 'జైశ్రీరాం'లాంటి అతిసన్నరకాల బియ్యం పట్టణ ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్నాయి. ఏదేమైనా సర్కారు సన్నబియ్యంతో పేద, మధ్య తరగతి వర్గాలకు బియ్యంపై వెచ్చించే డబ్బులు మిగిలినట్లవుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రైవేటు బియ్యానికి పడిపోయిన డిమాండ్..

కేసముద్రంలో బియ్యం హోల్‌సేల్ ధరలు క్వింటాకు

రకం	కొత్తవి	పాతవి
ఆర్ఎన్ఆర్/హెచ్ఎంటీ	3800	5000
జైశ్రీరాం	4800	6200

పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్‌డ్ సర్వేయర్లు, గ్రామ పరిపాలన అధికారుల పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నోడల్ అధికారులు, పరిశీలకులు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలెటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఆదివారం లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షల నిర్వహణ కోసం అనంతారం రోడ్డులోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షలకు 181 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు దఫాలుగా పరీక్షలు జరుగుతాయని చెప్పారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామ పరిపాలన అధికారు (వీపీవో)ల పరీక్షను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో 56 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం. పరీక్షల నిర్వహణ కోసం నోడల్ అధికారులు, అబ్జర్వర్లు, ఇన్విజలేటర్లను పరీక్షల నిర్వహణకు నియమించడం జరిగిందని పేర్కొన్నారు. సంబంధిత పరీక్ష కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించి, ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు నర్సింహామూర్తి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, మరియన్న, సురేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ఏపీఎంల బదిలీలు



మహబూబాబాద్ మండల సమాఖ్య ఏపీఎంగా బదిలీపై వచ్చిన శంకర్

మహబూబాబాద్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 18 మండలాల్లోని మండల సమాఖ్యలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీఎం)లను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం బదిలీ చేశారు. మహబూబాబాద్ మండల ఏపీఎంగా శంకర్, కొత్తగూడకు రవీందర్, గంగారంకు ఉపేందర్, బయ్యారంకు తిరుమలసింగ్, కేసముద్రంకు కృష్ణమూర్తి, నెల్లికుదురుకు నరేందర్, తొర్రూరుకు సునీత, పెద్దవంగరకు పాషా, దంతాలపల్లికి సంజీవరావు, నర్సింహులపేటకు రాములు, కురవికి దుర్గారావు, డోర్నకల్‌కు పాప య్య, చిన్నగూడూరుకు నర్సింహారావు, గార్లకు రాజు, మరిపెడకు అలివేలు మంగమ్మ, గూడూరుకు వీరయ్య బదిలీపై వెళ్లగా సీరోలు, ఇనుగుర్తి మండలాలకు ఇంకా ఎవరిని నియమించలేదు.



మహబూబాబాద్‌లో వైద్య విద్యార్థులతో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

- వారం రోజుల్లో అందుబాటులోకి హాస్టల్ భవనాలు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారం రోజుల్లో బాలికల, బాలుర హాస్టళ్లను అందుబాటులోకి తీసుకువస్తానని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల, హాస్టళ్ల భవన నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. వైద్య విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రోజులుగా ఎదురు చూస్తున్న బాలికల, బాలుర హాస్టళ్ల భవన నిర్మాణాలను పూర్తిచేసి వారం రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. హాస్టళ్ల భవనాలకు విద్యుత్, తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు పూర్తి చేసి వారం రోజుల్లో వైద్యకళాశాల బాలుర, బాలికల హాస్టళ్లకు విద్యార్థులను షిఫ్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్‌నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ బీమ్లానాయక్ పాల్గొన్నారు.

మహిళా రైతును కాటేసిన పాము

మహబూబాబాద్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మాధవాపురంలో ఓ మహిళ రైతు వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురైంది. బాతుతురాలి కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. మాధవాపురం గ్రామానికి చెందిన రైతు నూకల రాజేందర్ సతీమణి నూకల మల్లీశ్వరి తమ పత్తిచేనులో పనిచేస్తుండగా పాముకాటుకు గురైంది. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమెకు ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



ప్రజా సంక్షేమానికి **ప్రభుత్వం కృషి**

డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్

8

రూ.3.59 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

ఫోన్ హ్యాక్ చేసి.. సిమ్, ఆధార్ కార్డు బ్లాక్ చేసిన వైనం

మరిపెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరిపెడ బంగ్లాకు చెందిన ఓ వ్యాపారి ఫోన్ హ్యాక్ చేసి.. సిమ్, ఆధార్ కార్డులను బ్లాక్ చేసి ఆయన బ్యాంకు అకౌంట్‌లోని రూ.3.59లక్షలు కొట్టేశారు. వీరభద్ర ఏజెన్సీకి చెందిన తాడూరి వీరన్నను సైబర్ నేరగాళ్లు ఓ అమ్మాయిని ఎరగా చూపి ఫోన్ హ్యాక్ చేశారు. సిమ్, ఆధార్ కార్డును గత పక్షం రోజుల కిందట జూలై 11న బ్లాక్ చేశారు. వీరన్న అకౌంట్‌లోని రూ.3.59లక్షలు సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. సిమ్, ఆధార్ కార్డులు సైతం బ్లాక్ కావడంతో ఆయన ఫోన్ పని చేయడం లేదు. టెలికాం సంస్థలకు చెందిన ఏజెన్సీ నిర్వాహకులను, ఆధార్ ఏజెన్సీ నిర్వాహకులను కలిసి బ్లాక్ అయిన సిమ్, ఆధార్ కార్డును సరి చేసుకున్నాడు. ఆయన అకౌంట్‌లో డబ్బులు లేక పోవడంతో తాను సైబర్ నేరగాళ్లతో మోసం పోయానని లబోదిబోమంటూ గురువారం మరిపెడ పోలీసులను ఆశ్రయించారు. 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి మోసం విషయం వారికి తెలిపారు. ఘటనపై మరిపెడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డిమందు తాగి మహిళ ఆత్మహత్య

డోర్నకల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ మహిళ మనస్తాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కస్నాతండా గ్రామపంచాయతీ శివారు గన్యతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం. గన్యతండాకు చెందిన బానోత్ పద్మ (48) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. పద్మ గత కొంతకాలంగా మద్యానికి బానిసకావడంతో మానసికంగా ఇబ్బందులు పడుతూ ఉండేది. ఈ నెల 23న ఇంటివద్ద ఎవరు లేని సమయంలో గడ్డిమందు తాగింది. కుటుంబసభ్యులు 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా పద్మ మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. మృతురాలు పద్మ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీరుసీసాతో ఆర్టీసీ బస్సుపై దాడి

● డ్రైవర్, కండక్టర్‌కు గాయాలు

డోర్నకల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగిన ఓ యువకుడు ఆకతాయి తనంతో డోర్నకల్‌కు వచ్చే ఆర్టీసీ బస్సుపై బీరుసీసాతో దాడి చేసినట్లు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద గల సీతారామప్రాజెక్టు నిర్మాణం ప్రాంతంలో ఓ యువకుడు తాను తాగిన బీరు మద్యం బాటిల్ డోర్నకల్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సుపైకి విసిరాడు. ఈ ఘటనలో బస్సు ముందుభాగం అద్దంపగిలి డ్రైవర్, కండక్టర్‌లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు యువకుడిని పట్టుకునే ప్రయత్నం చేయగా అతడు ద్విచక్రవాహనంపై పారిపోయాడు. ఘటనపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్, కండక్టర్‌లు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ దమ్ము చక్రాల కింద పడి డ్రైవర్ మృతి


శేషు(ఫైల్)

మంగపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) పొలంలో భూమిని ట్రాక్టర్ దమ్ము చక్రాలతో చదును చేస్తూ, ప్రమాదవశాత్తు కేజీవీల్స్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామ రైతులు, స్థానిక ఎస్సై టీవీఆర్. సూరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేటకు చెందిన దీకొండ యాకాంతం(లేట్)- వెంకట లక్ష్మి దంపతుల రెండో కుమారుడైన దీకొండ శేషు(27) అనే అవివాహితుడు ఉన్నాడు. గ్రామ శివారులో బుచ్చంపేటకు చెందిన రాచకొండ మల్లయ్య అనే రైతుకు చెందిన పొలంలో కేజీవీల్స్ ట్రాక్టర్‌తో శుక్రవారం పొలం దున్నుతున్నాడు.

ఈక్రమంలో అకస్మాత్తుగా ఫిట్స్(మూర్ఛ) వచ్చి ట్రాక్టర్ నుంచి పక్కనే ఉన్న కాలువలో పడి తలమీద దమ్ముచక్రాల కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఎడమ కంటి నుంచి తల వరకు తీవ్ర గాయాలై కాలువలో నీళ్లు ఉండడంతో పాటు ట్రాక్టర్ శరీరంపై ఉంది. దీంతో ఊపిరాడక శేషు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు దీకొండ నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి తల్లి వెంకట లక్ష్మి ఉన్నారు. శేషు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఆక్టోపస్-పోలీస్ మాక్‌డ్రిల్

● జీఎం కార్యాలయాన్ని చుట్టుముట్టిన భద్రతా దళాలు

● ఉగ్ర, తీవ్రవాదుల దాడులను తిప్పికొట్టుటపై విన్యాసాలు


జీఎం కార్యాలయంలో మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ భద్రతా దళాలు

కృష్ణకాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాకేంద్రంలో ఆక్టోపస్ మాక్‌డ్రిక్ కార్యక్రమం చేపట్టింది. భూపాలపల్లి పోలీసు, ఆక్టోపస్ సంయుక్తంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సింగరేణి జీఎం కార్యాలయాన్ని ఆక్టోపస్, పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని కట్టడి చేశారు. ఉగ్రవాదులు గానీ, తీవ్రవాదులు గానీ దాడి చేస్తే ఎలా తిప్పికొట్టాలనే అంశంపై విన్యాసాలు చేశారు. జీఎం కార్యాలయంతో పాటు పక్కనే ఉన్న సింగరేణి కార్యాలయాలన్నింటిని ఆక్టోపస్ భద్రతా దళాలు, పోలీసులు సుమారు 60 మంది చుట్టుముట్టారు. వారు చేస్తున్న చర్యలను చూసిన ప్రజానీకం ఏం జరిగిందోనని ఒకింత హైరానా పడ్డారు. ఈ సందర్భంగా భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ తీవ్ర, ఉగ్రవాదులు దాడి చేస్తే ఎలా తిప్పికొట్టాలో ప్రజలను అప్రమత్తం చేయడంలో భాగంగా ఈ మాక్‌డ్రిల్ చేపట్టినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా తెలంగాణ పోలీస్ సమర్థవంతంగా తిప్పికొట్టుటకు సిద్ధంగా ఉందని, ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలుపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ వీరరాజు, ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, మిగతా ఆక్టోపస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ములుగు కలెక్టర్ దంపతులు

భద్రకాళి ఆలయంలో ములుగు కలెక్టర్ దంపతుల పూజలు

వరంగల్ కల్చరల్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరంలోని చరిత్ర ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ములుగు కలెక్టర్ దివాకర్ కుటుంబ సభ్యులతో సహా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ధర్మకర్తలు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. అర్చకులు కలెక్టర్ దంపతులకు ఆశీర్వచనం అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు ఇస్సిపేటకు కేటీఆర్ రాక

మొగుళ్లపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈ నెల 27వతేదీన మండలంలోని ఇస్సిపేట గ్రామానికి రానున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇస్సిపేట మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య గత ఏడాదిక్రితం అనారోగ్యంతో మృతిచెందారని, గ్రామ శివారులో కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని అన్నారు. కేటీఆర్ పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరుగుతుందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, చిట్యాల మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కడారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

దివ్యాంగులకు వైకల్యం అడ్డురావొద్దు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో అద్భుతమైన ప్రతిభ ఉంటుందని.. వారికి అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తారని భూపాలపల్లి జిల్లా కలెకర్ రాహుల్‌శర్మ స్పష్టం చేశారు. శుక్రవారం భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారిత విభాగం ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్-2025ను స్థానికంగా ఉన్న సింగరేణి మినీ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, పథకాల ద్వారా దివ్యాంగుల ప్రతిభకు తగిన గుర్తింపువస్తుందన్నారు. జిల్లాలో మొదటి సారి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామం అన్నారు. దివ్యాంగులకు ఉన్న పథకాలను మారుమూల గ్రామ స్థాయికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 18 ఎన్‌జీవోల స్టాళ్లను ఏర్పాటు చేయగా కలెక్టర్ వాటిని పరిశీలించి ఆశ్చర్యపోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, జిల్లా ఇన్‌ఛార్జీ సంక్షేమాధికారిని మల్లీశ్వరి, డాక్టర్ బీవీ రామ్‌కుమార్ పాల్గొన్నారు.


కాళేశ్వరం వద్ద గోదావరి మట్టం

పెరిగిన గోదావరి నీటి మట్టం

మహదేవపూర్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమం వద్ద గోదావరి 9 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. ఎగువన మహారాష్ట్రలో భారీ ఎత్తున వర్షాలు కురవడంతో పాటు తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షం కురుస్తుండడంతో పెద్ద ఎత్తున గోదావరిలోకి వరద నీరు చేరింది. రేపటి వరకు గోదావరి మట్టం పెరుగనుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం బ్యారే జీకి వచ్చే ఇన్‌ఫ్లో 3.41లక్షల క్యూసెక్కులుగా నమోదుకాగా గేట్లన్నీ ఓపెన్ చేసి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి నది 4.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

బొగతకు తగ్గిన వరద ఉధృతి

వాజేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నయాగరా బొగత జలపాతం సాధరణ స్థితికి చేరుకుంది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జలపాతానికి వరద నీరు పోటెత్తడంతో ఉగ్రరూపం దాల్చింది. శుక్రవారం తేలికపాటి వర్షాలు కురవడంతో జలపాతం వరద నీటి ప్రవాహం తగ్గింది. భారీ వర్షాలకు జలపాతం ముందు భాగంలో ఉన్న రక్షణ కంచె, రాతిబండలు కొట్టుకుపోవడంతో ఫారెస్టు అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. కాగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఫారెస్టు అధికారులు 26వ తేదీ వరకు జలపాత సందర్శనను నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో మరిన్ని రోజులు సందర్శనను నిలిపివేసే అవకాశం లేకపోలేదు. కాగా జలపాతం తెల్లటి జలధారలతో ఆకట్టుకుంటుంది.


ఆకట్టుకుంటున్న బొగత అందాలు

న్యూసైన్స్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

జెన్‌పాక్ట్ కంపెనీలో నియామకాల కోసం నిర్వహణ


ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు

హనుమకొండ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్ రోడ్డులోని న్యూసైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి ఆధ్వర్యంలో జెన్‌పాక్ట్ కంపెనీలో నియామకాల కోసం శుక్రవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 242 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల డైరెక్టర్ కె.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్ మొదటి రౌండ్‌లో పర్సనల్ ఇంటర్వ్యూ, రెండో రౌండ్‌లో ఆపరేషన్ నిర్వహించగా మొత్తం 56మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేషం, సీహెచ్ కమలాకర్‌లు అభినందించారు. కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కంప్యూటర్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పట్టు సాధించాలని, వీటి కోసం తమ కళాశాలలో ప్రత్యేకంగా ఉచిత ట్రైనింగ్ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రావణ్ కుమార్, వి.మధుకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అహ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ సూచించారు. పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, డైరెక్టర్ సృజనలతో కలిసి కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగామ కలెక్టరేట్ కార్యాలయం నుంచి పింకేశ్ కుమార్, జడ్పీ సీఈవో మాధురిషాతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రతీ రోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. చెత్తాచెదారం తొలగిస్తూ, వనమోత్సవాన్ని చేపట్టి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వసతి గృహలు, పాఠశాలు, వైద్యశాలల్లో పర్యవేక్షణలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో డీపీవో స్వరూప, డీఎంహెచ్‌వో మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, అధికారులు

విద్యుదాఘాతంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

నర్మెట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో విద్యుత్ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం మల్కపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మల్కపేటకు చెందిన బానోతు రాజు(30) కరెంట్ డిపార్ట్‌మెంట్‌లో ఔట్‌సోర్సింగ్ కట్టర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని దొంగలచెలిమెతండాలో 11కేవీ విద్యుత్ పోల్ ఎక్కి డీటీఆర్ ఫీజు వైరు చుడుతుండగా ప్రమాదవశాత్తు ఫ్యూస్ వైర్ నుంచి ఎడమ చేతికి విద్యుత్ షాక్ తగలడంతో కరెంట్ పోల్ నుంచి కింద ఉన్న మోరీ గద్దెపై పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య నీల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.


తొర్రూరులో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కొత్త పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

తొర్రూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన కొత్త పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం తొర్రూరులో తెలంగాణ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజయ్య, కె.వెంకటాచారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది సామాజిక భద్రత అని, శ్రమనే పెట్టుబడిగా పెట్టి జీతం డబ్బులతో గడిపే ఉద్యోగులు వయసు పైబడటం వల్ల ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పేదరికంలోకి వెళ్లకుండా పెన్షన్ కాపాడుతుందన్నారు. పెన్షనర్‌లకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశంలో బిల్లులు ప్రవేశపెట్టారని, దీనిద్వారా కొత్త పీఆర్సీ, డీఏ ప్రయోజనాలకు పెన్షనర్‌లకు లేకుండా పోతున్నాయన్నారు. వెంటనే కొత్త పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, యాకూబ్, అమీర్, సురేష్, నారాయణ, నాగేశ్వర్‌రావు, చంద్రప్రకాశ్, మనోహర్ రాజు, భిక్షపతి, చంద్రశేఖరాచారి తదితరులు ఉన్నారు.

బాలికలను లైంగికంగా వేధించిన వృద్ధుడి అరెస్టు

పాలకుర్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల బాలికను లైంగిక వేధింపులకు పాల్పడిన వృద్ధుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య తెలిపారు. శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ జానకీరాంరెడ్డితో కలిసి ఏసీపీ ఘటన వివరాలను వెల్లడించారు. తీగారంనకు చెందిన పోగు సోమయ్య అనే వృద్ధుడు ఓ గ్రామానికి చెందిన బాలికలను ఈనెల 22న లైంగిక వేధింపులకు గురిచేశాడు. బిస్కెట్లు, డబ్బుల ఆశ చూపి అఘాయిత్యాలకు పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు విచారణ చేపట్టినట్లు తెలిపారు. సదరు వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వాగు దాటి వైద్య సేవలు

ఏటూరునాగారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్ల జంపన్న వాగు మీదుగా పడవలో చేరుకుని, అక్కడి నుంచి మల్యాల, కొండాయి గ్రామాలకు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అయితే, శుక్రవారం కొండాయి వైద్య అధికారి డాక్టర్ హెచ్. ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో మల్యాల గ్రామంలోని ఏయూపీఎస్ పాఠశాలలో ఈ ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు 45 మందికి మందులు పంపిణీ చేశారు. కాగా, ఇద్దరికి మలేరియా పరీక్షలు చేయగా, నెగిటివ్ వచ్చాయని తెలిపారు. వారికి అవసరమైన మందులను అందజేసి, ప్రజలు ఆహారం, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమ తెరలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. అలాగే, కాచి చల్లార్చిన నీటిని తాగమని అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, హెచ్‌ఎం శేషయ్య, ఆశ కార్యకర్తలు జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మల్యాలలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రణీత్

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2645	1521
పల్లికాయ (సూక)	5670	3450
పల్లికాయ (పచ్చిది)	4750	1575
కందులు	6232	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7810	5300
పసుపు (కాడి)	10322	9534
పసుపు (గోల)	9459	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	13300	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	13200	11500
యూఎస్341ఏసీ	12800	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

శుభకరం.. శ్రావణమాసం..

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు ప్రారంభం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- వేయిస్తంభాల ఆలయంలో లక్ష తులసీ అర్చన



రుద్రేశ్వరాలయంలో తులసీ అర్చన నిర్వహిస్తున్న అర్చకులు



కరెన్సీ దండల అలంకరణలో సంతోషిమాత



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈసారి వారం రోజుల ముందే శ్రావణ సందడి ఆరంభమైంది. శ్రావణ తొలిరోజు శుక్రవారం కావడంతో అన్ని ఆలయాల్లో భక్తుల తాకిడి పెరగడంతోపాటు ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఒక పక్క వర్షం పడుతున్నా భక్తి శ్రద్ధలతో ఆలయాలకు చేరుకొని వేడుకల్లో పాల్గొన్నారు. ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరింపజేసి వేడుకలను ఆరంభించారు. రాజరాజేశ్వరి ఆలయంలో శ్రావణవ్రతాలు సందడిగా ప్రారంభం అయ్యాయి. చారిత్రక హనుమకొండలోని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో భక్తుల కోలాహలం మధ్య శ్రావణ వేడుకలు ప్రారంభం అయ్యాయి. మహాలక్ష్మీ ప్రీతికర శుక్రవారం రోజు శ్రావణమాస ప్రారంభవేళ రుద్రేశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, సందీప్ శర్మల ఆధ్వర్యంలో లక్ష తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. ప్రముఖ శివభక్తుడు గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు, ఉమారాణి దంపతుల సౌజన్యంతో లక్ష నామాలతో తులసీ అర్చనను ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు గట్టు మహేశ్‌బాబుతోపాటు అనేక మంది వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులు తొలినాటి శ్రావణ వేడుకల్లో పాల్గొన్నారు.

హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరాల్లోని మార్వాడీ మహిళలు సుమారు 200 మంది లష్కర్‌బజార్ రాంమందిర్ నుంచి ఊరేగింపుగా శివనామ స్మరణతో బాజా భజంత్రీలను గంగాజల కావడిలను భుజంపై ధరించి ఊరేగింపుగా వేయిస్తంభాల ఆలయానికి చేరుకొని కావడి పూజ నిర్వహించుకున్నారు. ఆలయ నాట్యమండపంలో శ్రావ్యంగా భక్తి పాటలతో సందడి చేస్తూ ఆధ్యాతికతను గుబాళింపజేశారు.

హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో శ్రావణ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సిద్దేశుని సురేశ్, రవికుమార్ ఆధ్వర్యంలో సిద్ధేశుడి పాడ్యమి తిథిని పురస్కరించుకొని అమర్‌నాథుడిగా ప్రత్యేకంగా అలంకరింపజేసి పూజలు నిర్వహించారు. హనుమకొండ అదాలత్ వెంకటేశ్వరాలయం, రెవెన్యూ రామాలయం, శ్రీరంగనాథుడి పెద్ద కోవెలలో శ్రావణ వేడుకలు ప్రారంభం అయ్యాయి.

కిటకిటలాడిన దేవాలయాలు

శ్రావణ మాసం వేడుకలను పురస్కరించుకొని వరంగల్ హంటర్‌రోడ్డులోని శ్రీసంతోషిమాత దేవాలయంలో అమ్మవారిని కరెన్సీ దండలతో అలంకరించారు. ములుగురోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో అర్చకుడు రాపాక గోపీకృష్ణశర్మ ఆధ్వర్యంలో శ్రావణ మాసోత్సవాలు నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకం, పూజలు, అలంకరణ జరిపించారు. సామూహికంగా వరలక్ష్మి వ్రతాలను ఆచరింప చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవీ మాత దేవాలయం, శివనగర్‌లోని లలితామాత దేవాలయం, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం, దుర్గేశ్వర, రామలింగేశ్వర, భోగేశ్వర, ఆకారపువారి గుడి, కాశిబుగ్గ శివాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీలలితా సహస్ర పారాయణాలు, దివ్యనామ సంకీర్తలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల అన్నప్రసాదాలు అందించారు.



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

క్రీడా స్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా పోటీ పడాలి..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- ఆఫీసర్స్ క్లబ్‌లో మూడు రోజులు పాటు క్రీడలు
- హాజరైన 250మంది షట్లర్లు, కోచ్‌లు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా క్రీడల్లో పోటీ పడాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చన్నారు. తను స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడినని, ఎన్నో టోర్నమెంట్లలో పాల్గొన్నారన్నారు. ఈ క్రమంలో తన భుజానికి గాయం కావడంతో బ్యాడ్మింటన్ క్రీడకు దూరం కావాల్సి వచ్చిందన్నారు. వ్యాయామంలో భాగంగా ప్రతీరోజు టెన్నిస్, క్వాష్ క్రీడల్లో సాధన చేస్తున్నానన్నారు. మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీపీ(ఎస్‌బీ) మూల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సింగిల్స్, డబుల్స్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ టోర్నీలో 20 జిల్లాల నుంచి 250మంది క్రీడాకారులతో పాటు 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, అంపైర్లు పాల్గొన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వీసీ డాక్టర్ టి. యాదగిరిరావు, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము రాజేందర్, కోశాధికారి నాగ కిషన్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, ఆఫీసర్స్ క్లబ్ ఇంచార్జీ కార్యదర్శి బి.కన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మిక్స్‌డ్ డబుల్స్‌లో తలపడుతున్న షట్లర్లు

భద్రకాళి ఆలయంలో శ్రావణ పూజలు



అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న ములుగు కలెక్టర్ దంపతులు

వరంగల్ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాసం పూజలు జరిగాయి. నెల రోజుల పాటు కొనసాగే వేడుకల్లో భాగంగా అమ్మవారికి నిత్య పూజ, నిత్య అర్చన నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు.

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ధర్మకర్తలు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శేష భారతితో పాటు చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్‌రెడ్డి, గాండ్ల స్రవంతి, ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగుల ఆంజనేయులు, బింగి సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోగనున్న పెళ్లిభాజా

నేటి నుంచి శుభ ముహూర్తాలు



వెంకటాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆషాడం ముగిసింది. శుక్రవారం శ్రావణ మాసం ప్రారంభమైంది ఈ మాసం వస్తూవస్తూ ఎన్నో శుభ ముహుర్తాలను తెచ్చింది. సుమారు రెండు నెలలుగా శుభ ముహూర్తాలు లేకపోవడంతో పెళ్శిళ్ళు నిలిచిపోయాయి. దీంతో శ్రావణమాసం ఎప్పుడొస్తుందా అని చాలా మంది వేచి చూశారు. ఈ నెల 26, 30, 31, తేదీలతో పాటు వచ్చే నెల 1 , 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీలో వేలాది పెళ్లిళ్ళు జరుగనున్నాయని పండితులు పేర్కొన్నారు. ఆ తర్వాత భాద్రపద మాసంలో శుభముహర్తాలు ఉండవని, సెప్టెంబరు నాలుగో వారం నుంచి నవంబర్ చివరి వరకు వివాహాది శుభకార్యాలకు ముహర్తాలు ఉంటాయని చెబుతున్నారు. ఇప్పటికే చాలా మంది పెళ్శిళ్ళు, ఇతర శుభకార్యాలకు ముహర్తాలు నిశ్చయించుకున్నారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో అంతటా పెళ్లి కళ కనిపిస్తోంది. వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. అయితే ముహర్తాల సమయంలో బంగారం ధరలు మరింత పెరగడంతో కొనుగోలుదారులను ఆందోళనకు గురి చేస్తోంది.



అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభ

భూ సేకరణకు సహకరించాలి

- గాడిపల్లి గ్రామసభలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- బాధితులకు నష్టపరిహారం ప్రకటించిన అధికారులు
- అసంతృప్తి వ్యక్తం చేసిన భూ బాధితులు

మామునూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి కోరారు. మామునూరు మండలం గాడిపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె రైతులతో మాట్లాడారు. ఇండ్లు కోల్పోయిన వారికి భూ చట్టం ప్రకారం కలెక్టర్ సత్యశారద ఒక రేటు నిర్ణయించారని, ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఇండ్లు కోల్పోతున్న 20మంది నిర్వాసిత కుటుంబాలను గుర్తించారని, చట్ట ప్రకారం నష్టపరిహారాన్ని అందజేస్తామని అన్నారు. 2013 భూచట్టం ప్రకారం జనరల్ స్కీం కింద (ల్యాండ్ ఆక్యూపేషన్, వన్ టైం రీ సెటిల్‌మెంట్, షిఫ్టింగ్ ట్రాన్స్‌పోర్ చార్జెస్, 12 నెలల రెంట్ అలవెన్స్) మొత్తం కలిపి రూ.7లక్షల86 వేలు అందజేస్తారని, 2016 చట్టం ప్రకారం కాన్సెంట్ స్కీం కింద (ల్యాండ్ ఆక్యూపేషన్, వన్ టైం రీ సెటిల్‌మెంట్, షిఫ్టింగ్ ట్రాన్స్‌పోర్ చార్జెస్, 12 నెలల రెంట్ అలవెన్స్) మొత్తం కాన్సర్డ్ స్కీం కింద రూ.11 లక్షల 56 వేలు నష్టపరిహారం అందుతుందని అన్నారు. అంతే కాక బిల్డింగ్ నిర్మాణ ఖర్చులను లెక్కించి అదనంగా అందజేస్తారని, దీనికి ఒప్పుకున్నట్లైతే 12 ఇండ్లకు సంబంధించి మొత్తం 20 మంది కుటుంబ సభ్యులు రతపూర్వకంగా సంతకాలు చేసి తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు. వీరు కాకుండా ఇంకెవరైనా అర్హులు ఉంటే ఆధార్ కార్డు, ఓటర్ కార్డు సమర్పించాలని సూచించారు. తప్పుడు ఆధారాలతో ప్రభుత్వ బెనిఫిట్స్ పొందాలని చూస్తే చీటింగ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బాధిత రైతులు ఆందోళనకు దిగారు.

నష్టపరిహారంపై అసంతృప్తి..

ఏళ్ల తరబడి నివాసముంటున్న ఇండ్లను తాము వదులుకోలేమని, మార్కెట్ రేటుకు తగ్గట్టుగా నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే ఇల్లుకు బదులు ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి మూడు సార్లు గ్రామ సభ నిర్వహించి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, మామునూరు సీఐ రమేష్ పాల్గొన్నారు.

మాకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి..



నాకు నాలుగు గుంటల ఇంటి స్థలం ఉంది. దానికి బదులుగా వసంతపూర్ రోడ్డు పక్కన అంతే స్థలంలో ఇల్లు కట్టించి ఇవ్వాలి. అంతేతప్ప ఇతర ఏ బెనిఫిట్స్ వద్దు. భూమికి బదులు భూమి ఇస్తేనే సరి. లేకపోతే చావుకైనా సిద్ధమే.

- కత్తెరపల్లి లక్ష్మి, గాడిపెల్లి

న్యాయం చేయకపోతే ఊరుకోం..



మాకు పైసలు వద్దు ఏమీ వద్దు.. మమ్మల్ని ఇలా బతకనివ్వండి.. మా అమ్మ వృద్ధురాలు. ఈ ఇంట్లోనే తుది జీవితం గడపాలనుకుంటోంది. వేరే దగ్గర ప్రాణం పోతే ఆత్మశాంతించదు. మా ఇంటిలో ఉంటేనే మాకు సంతృప్తి.ఇతర ప్రాంతాలకువెళ్లలేం. బలవంతం చేస్తే ఆందోళనకు దిగుతాం.

- జల్ల యాకమ్మ

ఏడూళ్ల ఏటి కష్టాలు తీరేనా?





2023 జూలైలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన కొండాయి బ్రిడ్జి, కొండాయి బ్రిడ్జి వద్ద జంపన్నవాగును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

- పడవ ప్రయాణమే శరణ్యం
- ప్రతి వర్షాకాలంలో తప్పని అవస్థలు
- రెండేళ్లయినా సాగని పనులు
- కొండాయి బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం
- కొట్టుకుపోయిన కొండాయి- దొడ్ల తాత్కాలిక రహదారి

ఏటూరునాగారం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా వర్షాకాలం వచ్చిందంటే ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, దొడ్ల, మల్యాల, దొడ్ల కొత్తూరు, గోవిందరాజులకాలనీ, ఐలాపురం, ఎలిశెట్టిపల్లి గ్రామాల ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ఈ ఏడాదీ అదే దుస్థితి నెలకొంది. ఈ గ్రామ ప్రజలకు పడవ ప్రయాణమే ఏకైక శరణ్యంగా మారింది. రవాణా మార్గం లేక ప్రతి వర్షాకాలంలోనూ పడవ ప్రయాణమే వారికి దిక్కవుతోంది. రోడ్లు, బ్రిడ్జిలు లేకపోవడంతో వర్షాలు మొదలవగానే జలమయమయ్యే వాగులు, వంకలను దాటడానికి స్థానికులు పడవలపై ఆధార పడక తప్పడం లేదు. ఇది కేవలం ప్రయాణ సౌకర్య సమస్య మాత్రమే కాదు, ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదకరమైన ప్రయాణం. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి సరైన రవాణా సదుపాయం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పడవ ప్రయాణాల్లో అనేక ప్రమాదాల ఘటనలూ చోటు చేసుకున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ఈ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు ప్రభుత్వం వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. కొండాయి బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో దొడ్ల-మల్యాల మధ్య తాత్కాలిక రహదారి కూడా అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. మట్టి రోడ్డు ధ్వంసమై వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకుండా పోయింది. వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ గ్రామాలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. 2023 జూలైలో వచ్చిన భారీ వరదలకు కొండాయి-దొడ్ల గ్రామాల మధ్య నున్న జంపన్నవాగు ఉప్పొంగి, కొండాయి హైలెవల్ బ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ విషాద ఘటనలో ఎనిమిది మంది జలసమాధి అయ్యారు. ఆ జ్ఞాపకాలు గిరిజనుల గుండెల్లో గుబులు రేపుతోంది. జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నా అవి ఈ ఏడాది పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ వర్షాకాలంలోనూ తమకు పడవ ప్రయాణం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా బ్రిడ్జి పనులను పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజలకు తప్పని రవాణా తిప్పల

ఏడు గ్రామాల ప్రజలకు మరోసారి రవాణా కష్టాలు మొదలయ్యాయి. రహదారులు అధ్వానంగా మారడంతో దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితి నెలకొంది. వైద్య సేవలు, నిత్యావసరాల కొనుగోళ్లు, విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఎదురవుతున్న ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

కొండాయి-దొడ్ల గ్రామాల మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

జంపన్నవాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి మట్టి రోడ్డు బురదమయంగా మారి, వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. పాదచారులు సైతం నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా వీడని భయాందోళన

2023 జూలైలో వచ్చిన భారీ వరదలకు కొట్టుకుపోయిన కొండాయి హైలెవెల్ బ్రిడ్జి దుర్ఘటన తాలూకు భయాందోళనలు స్థానికులను ఇంకా వెంటాడుతున్నాయి. జంపన్నవాగు ఉప్పొంగినప్పుడు బ్రిడ్జి కొట్టుకుపోయి వాగులో ఎనిమిది మంది మరణించిన విషాద ఘటనను మర్చిపోలేకపోతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన వారిని నిద్రపట్టనీయడం లేదు.

బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం ఎందుకు?

జంపన్నవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో జాప్యం చోటు చేసుకోవడం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కొట్టుకుపోయిన కొండాయి హైలెవెల్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి సీతక్క ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ. 16.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ డ్రిల్లింగ్ పనులకు వెనుకంజ వేశారు. ఈ వంతెన పనులు పూర్తి కావాలంటే ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉందని, అవి ఈ ఏడాది పూర్తయ్యే అవకాశం లేదని పలువురు అంటున్నారు. కొత్త బ్రిడ్జి త్వరగా పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఆశించిన ప్రజలకు, పనుల్లో జాప్యం నిరాశను మిగులుస్తోంది. బ్రిడ్జి పనులు నత్తనడకన సాగడం వల్ల ఈ ఏడాది కూడా రవాణా కష్టాలు తప్పవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఉచిత ప్రమాద బీమా

- ఎరువులు కొనుగోలు చేసిన వారికి ఇఫ్కో కంపెనీ కానుక
- రూ. 10 వేల నుంచి 2 లక్షల వరకు సౌకర్యం

వరంగల్ వ్యవసాయం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం చెమట చిందించే రైతన్నకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఇఫ్కో కంపెనీ సంకటహరణ పేరుతో ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఎలాంటి అదనపు చార్జీలు, ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా కేవలం ఆ కంపెనీ ఎరువులు కొన్నవారందరికీ ఈ బీమా వర్తిస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఫ్కో కంపెనీ వరంగల్ జిల్లా మేనేజర్ విశాల్ కోరుతున్నారు.

ఎరువులు కొంటే... బీమా

సహకార సంఘాలు లేదా దుకాణాలలో కొనుగోలు చేసే ప్రతీ ఎరువు బస్తా, లేదా నానో ఎరువు బాటిల్‌పై రూ.10 వేల బీమా వర్తిస్తుంది. అయితే దీనికి అత్యధికంగా రూ.2లక్షల వరకు పరిమితి విధించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే వందశాతం, రెండు అవయవాలు కోల్పోతే 50శాతం, ఒక అవయవం కోల్పోతే 25శాతం బీమా లభిస్తుంది. కొనుగోలు చేసిన నెల రోజుల నుంచి 12 నెలల వరకు ఈ ప్రయోజనం పొందవచ్చు. రోడ్డు ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాము కాటు, గ్యాస్ సిలిండర్ పేలిపోవడం, అగ్నిప్రమాదాలు, యంత్రాల వల్ల కలిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, ఆత్మహత్యలకు వర్తించదు.

నిబంధనలు పాటించాలి..

రైతులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. రశీదుపై కొనుగోలుదారుడి పేరు, తండ్రి పేరు లేదా భర్త పేరు, తేదీ, చిరునామా, కొనుగోలు చేసిన ఇఫ్కో ఎరువుల సంఖ్య, నామినీ పే రు, కొనుగోలుదారుడి సంతకం, వేలిముద్ర ఉండాలి. రశీదుతో పాటు కొ నుగోలు వివరాల ధ్రువీకరణకు విక్రయాల రిజిస్టర్ నకలు పత్రం, పోలీ స్టేషన్‌లో కేసు నమోదైన ఎఫ్ఐఆర్ కాపీ, వైద్యుడి చికిత్స నివేదిక, పోస్టుమార్టం నివేదిక, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. క్లెమ్ ప త్రాలను ప్రమాదం సంభవించిన తేదీ నుంచి 2నెలల్లోగా సికింద్రాబాద్‌లోని ఇఫ్కో టోకియోసాధారణ బీమాకంపెనీలిమిటెడ్‌కు పంపించాలి.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్

కురవి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డును లబ్ధిదారులకు అందించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డులను అందిస్తుందని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. సీరోలు మండలం ఉప్పరిగూడెంలో శుక్రవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీఆర్‌ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై ఎటువంటి భారాలు వేయకుండ సంక్షేమ పథకాలు కొనసాగిస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు విలువ లేదని,ప్రజాప్రభుత్వంలో బడుగుబలహీనవర్గాల మంత్రులు, ఎమ్మెల్యేలే ప్రభుత్వాన్ని నడిపి స్తున్నారని అన్నారు. డోర్నకల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాని, కురవి మండలం అయ్యగారిపల్లిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను, మరిపెడలో 100 పడకల ఆస్పత్రిని, డోర్నకల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనిట్‌ను, నర్సింహులపేట, దంతాలపల్లిలో ప్రైమరీ హెల్త్ సెంటర్లను మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజేంద్ర, తహసీల్దార్ పూర్ణచందర్, ఎంపీడీవో గౌస్, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అంబటి వీరభద్రం, కాలం రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉప్పరిగూడెంలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న రాంచందర్‌నాయక్

అర్హులకు సంక్షేమ ఫలాలు

● డోర్నకల్ : కాంగ్రెస్ పార్టీతోనే అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందుతాయని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని బిషప్ అజరయ్య ఫంక్షన్‌హాల్లో అర్హులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులు, రైతులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరితో పాటు రుణ మాఫీ చేసి, ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, బత్తుల శ్రీనివాస్, మాద శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, కోటిలింగం, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలి

● జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



కురవి జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

కురవి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యసన.. సామర్థ్యాలను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కురవిలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

● పీహెచ్‌సీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

కురవి మండలం బలపాల పీహెచ్‌సీని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని, మతా,శిశు మరణాలను తగ్గించాలన్నారు. ఇన్, ఔట్ పేషెంట్ల రిజిస్టర్లను పరిశీలించారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గోపి



కేసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కేసముద్రానికి చెందిన చందా గోపిని రెండోసారి నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం ప్రకటించారు. వేములవాడ రాజరాజేశ్వరి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం ఆత్మగౌరవ తొలి కార్యాచరణ సమావేశంలో ఈ నియామకం చేస్తూ ఉత్తర్వుల కాపీని గోపికి అందించారు. ఈ సందర్భంగా చందా గోపి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర నాయకుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కేసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'దోస్త్' పోర్టల్‌లో ఈనెల 25 నుంచి 31 వరకు ప్రత్యేక ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.రాజు శుక్రవారం తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. వివరాలకు 77807 01084 నెంబరులో సంప్రదించాలని కోరారు.

108 వాహనాల ఆకస్మిక తనిఖీ

మహబూబాబాద్ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన ఆస్పత్రిలో 108 వాహనాలను ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 108 అంబులెన్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ఫోన్ వచ్చిన వెంటనే సకాలంలో స్పందించి, బాధితులకు సత్వరమే వైద్య సేవలందించాలని సూచించారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలన్నారు. మానుకోట జిల్లా మేనేజర్ బత్తిని మహేష్, పైలెట్లు, ఈఎంటీలు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత జాగ్రత్తలు పాటించాలి

● డీఈ విజయ్



పొలంబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ్

గూడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ భద్రతా జాగ్రత్తలను పాటించాలని డీఈ విజయ్ అన్నారు. గూడూరు మండలం భూపతిపేట, రాజన్‌పల్లిలో శుక్రవారం పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ విజయ్ మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల వద్ద విద్యుత్ మోటార్లకు అమర్చే స్టార్టర్లకు ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన విద్యుత్ స్తంభాలు కనిపిస్తే వాటిని తాకవద్దని, వెంటనే విద్యుత్ సిబ్బందికి, లేదా 1912 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈపీ విజయ్, ఏడీఈ లోక్‌నాథ్ రెడ్డి, మెట్టు రామ్ పాల్గొన్నారు.

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

మహబూబాబాద్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ పరిధి జమాండ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎస్‌లోయా సేవా ట్రస్టు, యుగ పరివర్తన మిషన్ సహకారంతో సత్యజయ్ హోమియో క్లినిక్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు హోమియోపతిక్ ఫిజిషియన్ డాక్టర్ యాస తిర్మల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ, సీజనల్ వ్యాధులతో బాధపడే వారిని పరీక్షించి మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త రేషన్‌కార్డులతో కాంగ్రెస్‌కు పెరిగిన ఆదరణ

కేసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గత సర్కారులో పదేళ్లుగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఎదురుచూసిన కొత్త రేషన్‌కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం అందించడంతో ప్రజల్లో ఎనలేని ఆదరణ వస్తోందని ఆ పార్టీ తాళ్లపూసపల్లి గ్రామ అధ్యక్షుడు నరేటి కొమురయ్య అన్నారు. గ్రామంలో శుక్రవారం పలువురికి కొత్త రేషన్‌కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మురళీనాయక్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి మొదటి విడత బిల్లులు ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. నాయకులు రాచర్ల రాములు, రేషన్ డీలర్ గొర్రె వెంకన్న పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటాం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావత్ భాస్కర్

మహబూబాబాద్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని, అందుకోసం దానిని అడ్డుకుని తీరుతామని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావత్ భాస్కర్ హెచ్చరించారు. మహబూబాబాద్‌లోని వికాస్ జూనియర్ కళాశాలలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి దీపక్ ఆధ్వర్యంలో బనకచర్లతో తెలంగాణకు జరిగే నష్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధారావత్ భాస్కర్ మాట్లాడారు. ఏపీ చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చీకటి ఒప్పందం వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుందని విమర్శించారు. బనకచర్ల పేరుతో తెలంగాణ ప్రాంత నీటిని ఏపీకి తరలించే కుట్రను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రం ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు గుగులోతు రవినాయక్, బాదావత్ సురేష్, బానోత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లికుదురు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఇంటర్ మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు ఇల్లందుల సుమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ అగ్రికల్చర్ క్రాప్‌ప్రొడక్షన్ సీట్లు 40 ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతి 15, 7వ తరగతి 10 ఖాళీలు ఉన్నాయని, అడ్మిషన్‌లు ప్రారంభించినట్లు తెలిపారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

నెలికుదురు జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నెల్లికుదురు బీజేపీ మండల కమిటీ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చందు రాజ్‌కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా రాస యాకిరెడ్డి, జాటోత్ యుగేందర్, సురేష్, ఉపాధ్యక్షులుగా రంగాల రామచంద్రు, కుక్కల ఐలయ్య, ఆరే సురేష్, పెరమాండ్ల ఉష, కార్యదర్శులుగా ఎండి అరీఫా, తుప్పతూరి యాకాంబ్రం, మనోజ్, గుగులోత్ వనితను ఎన్నుకున్నారు.

బిజినెస్ ధమాల్..

(5వ పేజీ తరువాయి)

అంత్యోదయ అన్నయోజన (ఏఏవై) కార్డులు రెండు ఉండగా కార్డుకు 10కిలోల చొప్పున 20 కిలోల సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. అలాగే జిల్లాలో కొత్తకార్డుల జారీతో పెరిగిన వాటితో కలుపుకొని గతనెలలో 2,43,204 కార్డులుండగా 7,54,467 మంది సభ్యులున్నారు. వీటిలో అంత్యోదయ ఆహారభద్రత కార్డులు 16,750 ఉండగా 51,394 మంది సభ్యులకు 17,587.5క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. ఆహార భద్రత కార్డులు 2,26,452 ఉండగా 7,03,068 మంది లబ్దిదారులకు 1,26,552. 24 క్వింటాళ్ల బియ్యం, అంత్యోదయ అన్నయోజన కార్డులు రెండు ఉండగా 60 కిలోలు వెరసి అన్నిరకాల కార్డులకు మూడు నెలలకు 1,44,140.34 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు.

అర్చక సంఘం ప్రధాన కార్యదర్శిగా అభిలాష్‌శర్మ

కురవి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి వరంగల్ జిల్లా అర్చక సంఘం ప్రధాన కార్యదర్శిగా కురవి వీరభద్రస్వామి దేవాలయానికి చెందిన ఉటూరి అభిలాష్‌శర్మను నియమించినట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అర్చక ఉద్యోగ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గంగు ఉపేందర్‌శర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు నియామకపత్రం అందించారు. అభిలాష్‌శర్మను ఆలయ అర్చకులు అభినందించారు.

తగ్గిన వరద ఉధృతి

(5వ పేజీ తరువాయి)

అలుగుపడి తెగిన రోడ్డు మార్గంలో కాటినాగారం, కోమట్లగూడెం గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలను ఉదయం నుంచి కొనసాగుతున్నాయి. బయ్యారం మండలంలో పందిపంపుల వాగు వరద ఉధృతి కొంతమేర తగ్గింది. కంబాలపల్లి, సుద్దరేవు గ్రామాల మధ్య రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. సుద్దరేవు బ్రిడ్జి కింద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో చెత్తను తొలగించారు. దీంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. గార్లలోని పాకాల వాగు యథావిధిగానే ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గత నాలుగురోజులుగా రాంపురం, పులిగుట్టతండా, హన్యతండ, బోడతండా, రాముతండా, గొల్లచర్ల, కొత్తతండ, మద్దివంచ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై రియాజ్ పాష ఆధ్వర్యంలో ప్రజలు రాకుండా భారీ కేడ్‌లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు. గూడూరు మండలంలో మట్టేవాడ శివారు దొరవారితిమ్మాపురంకి ఇరువైపుల ఉన్న రెండువాగులు శుక్రవారం మధ్యాహ్నం నుంచి పొంగిప్రవహిస్తున్నాయి. దీంతో దొరవారి తిమ్మాపురంకు రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్‌లో మున్నేరువాగు ఉధృతి కొంత తగ్గింది. నర్సింహులపేట, పెద్దవంగర, మహబూబాబాద్, కురవి, మరిపెడ, తొర్రూరు మండలాల్లో శుక్రవారం సాయంత్రం వరకు చిన్నపాటి జల్లులు కురిశాయి.

జిల్లాలో 144 చెరువులకు మత్తడి..

మహబూబాబాద్ జిల్లాలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 1590 చెరువులు ఉండగా గురువారం నాటి వరకు 144 చెరువులు మత్తడిపోస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. 368 చెరువులు 75 శాతం నుంచి 100 శాతం వరకు, 360 చెరువులు 50 నుంచి 75 శాతం వరకు, 450 చెరువులు 25 నుంచి 50 శాతం వరకు నీరు చేరగా 268 చెరువుల్లో 0 నుంచి 25 శాతం వరకే నీళ్లు ఉన్నాయి. కొత్తగూడ మండలంలో 37 చెరువులు అలుగుపోయగా, 168 చెరువులు 75-100 శాతం వరకు నిండాయి.

గంగారం మండలంలో 76 చెరువులు మత్తడి పోయగా 97 చెరువులు 75-100 శాతం వరకు నిండుకున్నాయి. బయ్యారంలో 13 చెరువులు మత్తడి పోయగా 17 చెరువులు 100 శాతం వరకు నిండుకుంటున్నాయి. మహబూబాబాద్‌లో 7 చెరువులు మత్తడి పోయగా, 44 చెరువులు 75-100 శాతం వరకు నిండుకున్నాయి. పెద్దవంగర, దంతాలపల్లి, పెద్దవంగర, నర్సింహులపేట, ఇనుగుర్తి (రెండు చెరువులు అలుగుపడ్డాయి.), గార్ల (ఐదు చెరువులు అలుగుపడ్డాయి). మరిపెడ, తొర్రూరు, డోర్నకల్, చిన్నగూడూరు మండలాల్లో 50 శాతంలోపే నీరు చేరింది. దాంతో చెరువులు ఎప్పుడు నిండుతాయా అని ఆందోళన చెందుతున్నారు.

జీవోను ఉపసంహరించుకోవాలి



ఆందోళన చేస్తున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన జీవో నెంబరు 29ని ఉప సంహరించుకోవాలని మహబూబాబాబాద్ మదర్ థెరిస్సా సెంటర్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వెంకట్‌రాజు, ప్రధాన కార్యదర్శి కె.వీరన్న మాట్లాడారు. పల్లె రాములు, ఆరెంపుల వెంకటయ్య, అంబాల కృష్ణ, ఆశయ్య, నాగయ్య, రాములు, ముత్తయ్య, వీరస్వామి, వెంకన్న, రాములు, సుధాకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూపాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. తాగునీటి పైపులు, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్, గార్డెన్ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, హెచ్‌ఎం హల్యానాయక్ పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

తొర్రూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) కోర్సులో తక్షణ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు కస్తూర్బా ప్రిన్సిపాల్ బి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా గురుకులాల్లో నూతనంగా ఈ కోర్సు ప్రారంభమైందని, ఆసక్తిగల బాలికలు అవసరమైన ధ్రువపత్రాలతో కళాశాల పని వేళల్లో హాజరై ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు కస్తూర్బా గురుకులాల్లో సంప్రదించాలని, ఫోన్: 6301071295లో సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మరిపెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు వైద్య పరీక్షలు జరిపి మందులను అందించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కలిపించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై వివరించారు. పల్లె దవాఖానా సిబ్బంది సిరి, సూపర్‌వైజర్లు కృష్ణ, ప్రిన్సిపాల్స్ దయాకర్, సోమోజీ, ఏఎన్‌ఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్గిల్ దివస్

మరిపెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ బంగ్లాలోని కార్గిల్ స్థూపం దగ్గర అమర జవాన్ల కోసం శనివారం కార్గిల్ దివస్ నిర్వహిస్తున్నామని కార్గిల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లకు పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు, ప్రజలు హాజరై ఘన నివాళులర్పిద్దామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కట్టోజ్ గంగాధర్ ఆయన వెంట ఉన్నారు.

'బనకచర్ల'ను అడ్డుకుంటాం

బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

మరిపెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించే బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటామని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవికుమార్ అన్నారు. శుక్రవారం అయన ఆ సంఘం ఆధ్వర్యములో మరిపెడబంగ్లాలోని ఆర్‌జేఆర్‌ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణ రాష్ట్రానికి జరిగే నష్టంపై అవగాహన కలిపించారు. బండి దీపక్, భూక్య ప్రవీణ్, బాధవత్ సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.

మాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

తొర్రూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలలకు రాజకీయ పార్టీలు సముచితస్థానం ఇచ్చి తగు ప్రాధాన్యత కల్పించాలని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. శుక్రవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానం వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో రోస్టర్‌తో సంబంధం లేకుండా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రానున్న రోజుల్లో దళిత బహుజనుల ఐక్యతకు మాల మహానాడు పనిచేస్తుందని, వారి గెలుపుకోసం మాల మహానాడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల మహేష్, ఎనమల రాకేష్, అనిల్, ప్రవీణ్, మహేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారం గ్రంథాలయం

మరిపెడ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన భాండాగారం గ్రంథాలయమని ఎల్లంపేట హైస్కూల్ హెచ్‌ఎం బాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం ఎల్లంపేట హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో గ్రంథాలయాల-ఆవశ్యకత అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పీఎస్ స్కూల్స్ హెచ్‌ఎంలకు సూచించారు. గ్రంథాలయాల వలన విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్‌పీలు శ్యాంబాబు, విజయ్ కిరణ్, రవీందర్, గుగులోతు వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ భారతి రికార్డులను వేగవంతం చేయాలి

పెద్దవంగర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులల్లో తీసుకున్న దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి రికార్డులను తయారుచేయాలని తొర్రూరు ఆర్డీవో టి.గణేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతితో ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని, ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శంగా,చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. భూభారతితో రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఆర్ఐ లష్కర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిది ప్రజాప్రభుత్వం

మరిపెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిది ప్రజా ప్రభుత్వమని డిప్యూటీస్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఆడిటోరియం కం ఇండోర్ స్టేడియంలో నిరుపేదలకు నూతనంగా ప్రభుత్వం మంజూరి చేసిన రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదోళ్లకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐ శరత్, జిల్లా కాంగ్రెస్ నేత యుగేంధర్‌రెడ్డి, అభినవ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రఘువీర్‌రెడ్డి, మరిపెడ పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

నర్సింహులపేట (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నూతన రేషన్ కార్డులకు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం రూ.కోటి43 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, నర్సింహులపేట-తొర్రూరు నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో రాధిక, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి విద్యాసాగర్, విద్యుత్ శాఖ ఏఈ పాండునాయక్, మహబుబాబాద్ డిపో మేనేజర్ శివప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సామిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

డబ్బులు రికవరీ చేశాం : ఎస్సై

మరిపెడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లకు చిక్కిన డబ్బును రికవరీ చేసినట్లు మరిపెడ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వివిధ కారణాలతో సైబర్ నేరగాళ్ల వలకు బలైన వారు పోలీసులను ఆశ్రయించారు. 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కంప్లైయిట్ చేసి ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయగా హోల్డ్‌లో ఉంచబడిన అమౌంట్ రూ.60,821లను తొర్రూరు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆదేశానుసారం ముగ్గురు బాధితులకు ముట్ట చెప్పామన్నారు. సైబర్ నేరగాళ్లతో మోస పోయినోళ్లు సత్వరం 1930 టోల్‌ఫ్రీకి ఫోన్‌చేసి విషయం తెలపాలని సూచించారు. వెంటనే స్పందించి కేసులు ఫైల్ చేసిన ఎస్సై సతీశ్‌గౌడ్‌ను ఆయన అభినందించారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

తొర్రూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.సిద్ధు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, విద్యా శాఖకు మంత్రిని కేటాయించకుండా సీఎం ఆ శాఖకు ఇన్‌చార్జిగా ఉండడంతో విద్యార్థుల పాలిటశాపంగా మారిందన్నారు. గత 12ఏండ్లుగా స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు మూతపడ్డాయని, దీని కారణంగా ఎంతోమంది అర్హులైన లెక్చరర్‌లు ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. పట్టణంలో భారీ ర్యాలీ, ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్లియర్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వాస్, సాయి, మహేష్, కార్తీక్, రవి, స్వాతిక, నిహారిక, వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తూర్పుతండాలో వైద్యశిబిరం

దంతాలపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుతండా గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి ఆధ్వర్యంలో 50 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి రోగులకు మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు ప్రజలు పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల చుట్టూ నీటినిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వేడిచేసి నీటిని చల్లార్చిన తరువాత తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ మంగమ్మ, ఏఎన్‌ఎంలు శారద, సంధ్య, ఆశాలు మల్లికాంబ, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

గార్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో డీలర్లు ఎరువులు కృతిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్సు రద్దు చేయడంతో పాటు దుకాణాలను సీజ్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖాధికారి అజ్మీరా శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం గార్ల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో కావటి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.